




తెలుగు దినపత్రిక

# వార్త నిర్భయం

సామాన్యుని చేతిలో సామాజిక అస్త్రం!

www.vaarhtanirbhayam.com

ఎడిటర్ కాడేపాగు అశోక్

ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ





తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 132 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజీలు : 04, వెల రూ. 4రూ/ గురువారం- 09 - ఏప్రిల్- 2026

Published From Kurnool : Circulated at 'Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,


## తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన..

★తెలుగు రాష్ట్రాల్లోని వాతావరణ పరిస్థితులపై కీలక అప్‌డేట్ వచ్చింది.

★ రెండు రాష్ట్రాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములు, మెరుపులతోపాటు

★ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.



హైదరాబాద్/అమరావతి, ఏప్రిల్ 08: తెలుగు రాష్ట్రాల్లోని వాతావరణ పరిస్థితులపై కీలక అప్‌డేట్ వచ్చింది. రెండు రాష్ట్రాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములు, మెరుపులతోపాటు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న ఉపరితల ఆవర్తనం నుంచి తెలంగాణ, రాయలసీమతోపాటు తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉత్తర, దక్షిణ ద్రోణి ఏర్పడిందని పేర్కొంది. దీని ప్రభావంతో ఏపీలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు చేసింది.

**ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం..**

మిగతా..2లో

## ఇరాన్ ఒప్పందం ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి



○"వారు నిజాయతీగా చర్చలు జరిపితే, మేం కచ్చితంగా ఒక విస్తృత ఒప్పందాన్ని కుదుర్చుకోగలుగుతాం.

○"కీలక జలమార్గాలను తెరవండి, మేం కాల్పుల విరమణకు సిద్ధమవుతాం అని అధ్యక్షుడు స్పష్టంగా చెప్పారు"

అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతల తర్వాత కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం గంటల వ్యవధిలోనే ఒత్తిడికి గురవుతోందని అమెరికా వైస్ ప్రెసిడెంట్

## ఖరీఫ్ సీజన్‌లో న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,534 కోట్లు.. కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం

●ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారంనాడు జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 5 కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

●ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,533.81 కోట్లు కేటాయించారు.

●ఖరీఫ్ సీజన్‌లో న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,534 కోట్లు.. కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం




న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారంనాడు జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 5 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,533.81 కోట్లు కేటాయించారు. ఇది 2025 ఖరీఫ్ సీజన్‌లో బడ్జెటరీ కేటాయింపుల కంటే రూ.4,313 కోట్ల రూపాయలు అధికం. 2025 ఖరీఫ్ బడ్జెట్ రూ.37,216.15 కోట్లుగా ఉంది. కాగా, జైపూర్ మెట్రో ఫేజ్-2కు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.13,038 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడతారు. ప్రహ్లాద్‌పుర నుంచి తోడి-మోడ్ వరకూ 36 స్టేషన్లను కలుపుతూ 41 కిలోమీటర్ల పొడవైన నార్త్-సౌత్ కారిడార్‌గా దీన్ని నిర్మించనున్నారు. కేంద్ర, రాజస్థాన్ ప్రభుత్వం జాయింట్ వెంచర్‌గా రాజస్థాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ దీనిని చేపడుతుంది. రాజస్థాన్‌లో హెచ్‌పీసీఎల్ రిఫైనర్ కోసం రూ.79,459 కోట్లను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

మిగతా..2లో

## బెంగాల్‌లో లక్షలాది ముస్లిం ఓట్లను న్యాయపరిశీలనలో ఉంచారు



★రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో లక్షలాది మంది ముస్లింల ఓటు హక్కును ప్రశ్నార్థకంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

★మణిక్‌చక్‌లో 50 శాతం, బెర్హంపూర్‌లో 61.6 శాతం మంది ముస్లింల పేర్లు పరిశీలన జాబితాలో నిలిచిపోయాయని ఆరోపించారు.

పశ్చిమ బెంగాల్‌లో ఆయా నియోజకవర్గాల్లో పెద్ద మొత్తంలో ముస్లింల పేర్లను న్యాయ పరిశీలన జాబితాలో ఉంచడంపై మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంషేర్‌గంజ్ నియోజకవర్గంలో 55 శాతం మంది ముస్లింలు, మోతాబరిలో 54.2 శాతం, మణిక్‌చక్‌లో 50 శాతం, బెర్హంపూర్‌లో 61.6 శాతం మంది ముస్లింల పేర్లు పరిశీలన జాబితాలో నిలిచిపోయాయని ఆరోపించారు.

## నాదర్‌గూల్ భూముల వ్యవహారంపై హరీశ్ రావుకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్

▶▶నాదర్‌గుల్ భూములను తమ ప్రభుత్వం హయాంలో కట్టబెట్టినట్లు ఆరోపణలు చేయడాన్ని ఆయన ఖండించారు.

▶▶తమ ప్రభుత్వం వచ్చాక ఆ భూములు ప్రభుత్వానివేనని కౌంటర్ దాఖలు చేశామని వెల్లడించారు.

▶▶నాడు వాటాల కోసం భూములు కట్టబెట్టిన వారు ఇప్పుడు తమపై నిందలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



నాదర్‌గుల్ భూముల వ్యవహారానికి సంబంధించిన కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే నిరూపించాలని సవాల్ చేశారు.

నాదర్‌గుల్‌లో భూములను 2014లోనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సంస్థలకు అప్పగించిందని, వారి హయాంలోనే ఆ సంస్థల పేరిట రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కూడా జరిగిందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. నాడు జరిగిన రిజిస్ట్రేషన్‌తో తమ ప్రభుత్వానికేం సంబంధమని మండిపడ్డారు. నాదర్‌గుల్ భూములను తమ ప్రభుత్వం హయాంలో కట్టబెట్టినట్లు ఆరోపణలు చేయడాన్ని ఆయన ఖండించారు. హరీశ్ రావు చెబుతోన్న భూముల్లో 2022లోనే

మిగతా..2లో

## అబద్ధాలతో అధికార పార్టీ.. నిద్రమత్తులో బీఆర్ఎస్ పార్టీ

○కొత్త నెత్తురు, కొత్త రాజకీయంతో తెలంగాణ భవిష్యత్తును మారుస్తామని..

○వెలుగుమట్ల తరహాలో ప్రజల్లోనే ఉండి సమస్యలపై పోరాడతామని

○కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో ప్రజలను వంచిస్తోంది. రాష్ట్ర పాలన మొత్తం దిల్లీ నుంచే జరుగుతోంది.



హైదరాబాద్: తెలంగాణ చరిత్రను మార్చే, భవిష్యత్తును తీర్చిదిద్దే పార్టీ ఈ నెల 25వ తేదీన వస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఆవిర్భావం రోజు అద్భుతమైన ఎజెండా ప్రకటిస్తామని చెప్పారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయంతో తెలంగాణ భవిష్యత్తును మారుస్తామని.. దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. గద్వాల నియోజకవర్గానికి చెందిన నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు తెలంగాణ జాగృతిలో చేరారు. కవిత వారికి కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాగృతి తరపున ప్రశ్నిస్తాం... పోరాడతాం.. పరిష్కరిస్తామని తెలిపారు. వెలుగుమట్ల తరహాలో ప్రజల్లోనే ఉండి సమస్యలపై పోరాడతామని అన్నారు. "బీఆర్ఎస్ పార్టీ అచేతన స్థితిలో ఉంది.. నిద్రపోతోంది.

మిగతా..2లో

## మా దేశం వెళ్లిపోతాం... విశాఖలో డీఆర్వోను ఆశ్రయించిన ఇరాన్ యువతులు



తమను సురక్షితంగా స్వదేశానికి పంపేందుకు సహాయం చేయాలని కోరుతూ వారు విశాఖ జిల్లా అధికారులను ఆశ్రయించారు.

తమను వీలైనంత త్వరగా తిరిగి ఇరాన్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేయాలని వారు అధికారులను వేడుకున్నారు.

ఢిల్లీ : పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం విశాఖపట్నంలో చదువుకుంటున్న ఇరాన్ విద్యార్థినులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. తమ దేశంలోని కుటుంబ సభ్యులతో సంబంధాలు పూర్తిగా తెగిపోవడంతో, వారి సమాచారం తెలియక తీవ్ర ఆవేదన చెందుతున్నారు. తమను సురక్షితంగా స్వదేశానికి పంపేందుకు సహాయం చేయాలని కోరుతూ వారు విశాఖ జిల్లా అధికారులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే, విశాఖ నగరంలో డీఫార్మసీ చదువుతున్న కొందరు ఇరాన్ యువతులు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

మిగతా..2లో

## హరీశ్ రావు బహిరంగసభకు అనుమతుల రద్దు



రైతులకు మద్దతుగా ఈ నెల 9న నిర్వహించాలనుకున్న హరీశ్‌రావు బహిరంగ సభకు ప్రభుత్వం అకస్మాత్తుగా అనుమతులు రద్దు చేయడం రాజకీయ దుమారానికి దారితీసింది.

బెదిరింపులకు భయపడి ఉంటే తెలంగాణ వచ్చేదే కాదని నిరంజన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా గత 100 రోజులుగా సాగుతున్న రైతుల పోరాటం ఉద్రిక్తంగా మారింది. రైతులకు మద్దతుగా ఈ నెల 9న నిర్వహించాలనుకున్న హరీశ్‌రావు బహిరంగ సభకు ప్రభుత్వం అకస్మాత్తుగా అనుమతులు రద్దు చేయడం రాజకీయ దుమారానికి దారితీసింది. ప్రభుత్వం తొలుత అనుమతినిచ్చి,

మిగతా..2లో

## కష్టపడిన వారిని గుర్తించడమే టీడీపీ సిద్ధాంతం



★తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడమే తమ సిద్ధాంతమని మంత్రి నారా లోకేశ్ అన్నారు.

★పార్టీకి అండగా నిలిచిన వారిని ఎప్పటికీ విస్మరించేది లేదన్నారు.

అమరావతి: తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడమే తమ సిద్ధాంతమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. పార్టీకి అండగా నిలిచిన వారిని ఎప్పటికీ విస్మరించేది లేదన్నారు.

## రోడ్ల నిర్మాణంతోనే జాతి నిర్మాణం,

○రాష్ట్రంలోని పోర్టులను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించేలా పటిష్ఠమైన కనెక్టివిటీ వ్యవస్థను నిర్మించాలని దిశానిర్దేశం చేశారు.

○పొరుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాలను ఏపీతో అనుసంధానించేలా రహదారుల నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు.

○రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 45,433 కిలోమీటర్ల రోడ్లలో, ఏటా 10,238 కిలోమీటర్ల మేర నిరంతర నిర్వహణ చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు.



అమరావతి : రాష్ట్రంలో కేవలం ప్రయాణ సౌకర్యాల కోసమే కాకుండా, విస్తృతమైన ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పోర్టులను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించేలా పటిష్ఠమైన కనెక్టివిటీ వ్యవస్థను నిర్మించాలని దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో బుధవారం రహదారులు-భవనాలు, రవాణా, జాతీయ రహదారి ప్రాజెక్టులపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రహదారుల నిర్వహణ, గుంతలు లేని రోడ్లు, ఈవీ బస్సుల వినియోగం, పోర్టు కారిడార్ల అభివృద్ధి వంటి కీలక అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

మిగతా..2లో

## వచ్చే ఏడాది నా పాదయాత్ర... చంద్రబాబుకు సినిమా చూపిస్తాం

●కూటమి ప్రభుత్వం "దోచుకో.. పంచుకో.. తినుకో.." అనే సిద్ధాంతంతో పాలిస్తోందని

● వచ్చే ఏడాది తాను పాదయాత్ర ప్రారంభిస్తానని, అప్పటి నుంచి చంద్రబాబుకు ప్రతిరోజూ సినిమా చూపిస్తామని జగన్ హెచ్చరించారు.

●గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రగతిని తిరోగమనంలోకి నెట్టారని జగన్ ఆవేదన వ్యక్తం



అమరావతి :కూటమి ప్రభుత్వం "దోచుకో.. పంచుకో.. తినుకో.." అనే సిద్ధాంతంతో పాలిస్తోందని వైసీపీ అధినేత జగన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన చంద్రబాబు పాలనా తీరును ఎండగట్టారు.

## మొదటి పేజి తరువాయి

### వచ్చే ఏడాది నా పాదయాత్ర... చంద్రబాబుకు సినిమా చూపిస్తాం

వచ్చే ఏడాది తాను పాదయాత్ర ప్రారంభిస్తానని, అప్పటి నుంచి చంద్రబాబుకు ప్రతిరోజూ సినిమా చూపిస్తామని జగన్ హెచ్చరించారు. గత ప్రభుత్వంలో తాము చేసిన అప్పుల్లో మెజారిటీ వాటా (రూ. 2.73 లక్షల కోట్లు) నేరుగా డీబీటీ ద్వారా ప్రజల ఖాతాల్లోకి చేరిందని తెలిపారు. చంద్రబాబు ఈ రెండేళ్లలోనే రూ. 3.52 లక్షల కోట్ల అప్పు చేశారని... ఈ నిధులన్నీ ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు చెత్తబుట్టలోకి వెళ్లాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రగతిని తిరోగమనంలోకి నెట్టారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు.

### కష్టపడిన వారిని గుర్తించడమే టీడీపీ సిద్ధాంతం

'మై టీడీపీ యాప్' టాప్-10 ఫెర్మార్మర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వారితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'మై టీడీపీ యాప్' సమర్థ వినియోగం, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడంపై మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. మీ పని తీరే ఇక్కడి వరకు రావడానికి కారణమంటూ కొనియాడారు. ఉత్తమ కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం మరింతగా కష్టపడాలని, టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి లోకేశ్ భరోసా కల్పించారు.

### మా దేశం వెళ్లిపోతాం... విశాఖలో డీఆర్వోను ఆశ్రయించిన ఇరాన్ యువతులు

అక్కడ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) విశ్వేశ్వరనాయుడిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. యుద్ధం కారణంగా ఇరాన్‌లోని తమ కుటుంబాలతో మాట్లాడలేకపోతున్నామని, వారి యోగక్షేమాల గురించి సమాచారం తెలియక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నామని వివరించారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తాము ఇక్కడ ఉండలేమని, తమను వీలైనంత త్వరగా తిరిగి ఇరాన్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేయాలని వారు అధికారులను వేడుకున్నారు. విద్యార్థినుల విజ్ఞప్తిని స్వీకరించిన అధికారులు, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

### నాదర్‌గూల్ భూముల వ్యవహారంపై హరీశ్ రావుకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్

నిర్మాణాలు ప్రారంభమయ్యాయని అన్నారు. ఆ సమయంలో బీఆర్ఎస్ అధికారంలో ఉందని గుర్తు చేశారు. తమకు నాలా కన్వర్షన్ ఇవ్వలేదని భూములు పొందినవారు 2022లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తే, నాటి కేసీఆర్ ప్రభుత్వం కనీసం కౌంటర్ దాఖలు చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక ఆ భూములు ప్రభుత్వానివేనని కౌంటర్ దాఖలు చేశామని వెల్లడించారు. నాడు వాటాల కోసం భూములు కట్టబెట్టిన వారు ఇప్పుడు తమపై నిందలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు చెబుతున్న కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరూ లేరని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నాదర్‌గుల్ భూముల వ్యవహారానికి సంబంధించిన కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే నిరూపించాలని సవాల్ చేశారు. కాగా, నాదర్‌గూల్ భూముల వ్యవహారంపై ఇటీవల రాజకీయ దుమారం చెలరేగుతోంది. రూ.7 వేల కోట్ల విలువైన 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టిందని హరీశ్ రావు ఆరోపిస్తున్నారు. అయితే ఈ భూమి యజమాని ఏక్యూ రియాల్టర్ అని చెబుతున్నారు. ఇది ప్రైవేటు భూమి అని హైకోర్టు, సుప్రీంకోర్టు గుర్తించాయని ఏక్యూ రియాల్టర్ అడ్వకేట్ ఇటీవల తెలిపారు.

### అబద్ధాలతో అధికార పార్టీ.. నిద్రమత్తులో బీఆర్ఎస్ పార్టీ

గద్వాలలో చేనేత, పత్తి రైతులకు అన్యాయం జరుగుతుంటే కూడా ప్రశ్నించడం లేదు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో ప్రజలను వంచిస్తోంది. రాష్ట్ర పాలన మొత్తం దిల్లీ నుంచే జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారింది. ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తే జోగులాంబ జిల్లాలో తెలంగాణ జాగృతికి మొదటి విజయం దక్కింది. ఎమ్మెల్యే సీట్లలో మొదట గద్వాలలోనే విజయం సాధిస్తామని విశ్వాసం ఉంది. చూస్తుంటే గద్వాల గడీ మీద ఉద్యమకారుల జెండా ఎగురుతుందని అనిపిస్తోంది" అని కవిత అన్నారు

### ఖరీఫ్ సీజన్‌లో న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,534 కోట్లు.. కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం

అరుణాచల్ ప్రదేశ్‌లోని కమ్లే, క్రా దాది-కురుంగ్ కుమే జిల్లాల్లో రూ.26,069.50 కోట్లతో 1720 మెగావాట్ల ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు 96 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో 1200 మెగావాట్ల కళాయి-2 హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.14,105.83 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

### బెంగాల్‌లో లక్షలాది ముస్లిం ఓట్లను న్యాయపరిశీలనలో ఉంచారు

రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో లక్షలాది మంది ముస్లింల ఓటు హక్కును ప్రశ్నార్థకంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి ఓటు హక్కు విషయమై 'ఫారెనర్స్ ట్రైబ్యునల్' ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. ఆ నిర్ణయం వెలువడే వరకు వారు ఓటు వేయలేరని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల లోపు 'ఫారెనర్స్ ట్రైబ్యునల్' సభ్యులను ఏర్పాటు చేసి త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని కోరారు. తమ పేర్లు గల్లంతయ్యాయని లక్షలాది మంది ఓటర్లు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఎన్నికలకు ముందే నిర్ణయం తీసుకోవడం ద్వారా అందరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

### హరీశ్ రావు బహిరంగసభకు అనుమతుల రద్దు

సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాక వెనక్కి తగ్గడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకను నొక్కేయాలని చూడటం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా, తాము వెనక్కి తగ్గేది లేదని, హైకోర్టును ఆశ్రయించి సభకు అనుమతులు తెచ్చుకుంటామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమాలు, కేసులు కొత్త కాదని... బెదిరింపులకు భయపడి ఉంటే తెలంగాణ వచ్చేదే కాదని నిరంజన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రైతాంగ ప్రయోజనాల కోసం తమ పోరాటం కొనసాగుతుందని, ఈ నెల 9న హరీశ్‌రావు సభను జరిపి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### శబరిమల కేసు- మతంలోని మూఢనమ్మకాలను గుర్తించే అధికారం మాకు ఉంది: సుప్రీంకోర్టు

మత ఆచారాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవన్న కేంద్ర ప్రభుత్వం- మూఢనమ్మకాలను గుర్తించే అధికారం ఉందన్న సుప్రీంకోర్టు 'శబరిమలలో స్త్రీల ప్రవేశం' అంశంపై జరుగుతున్న విచారణ సందర్భంగా బుధవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మతపరమైన ఆచారాల్లో ఏది మూఢనమ్మకమో, కాదో నిర్ణయించే అధికారం, హక్కు న్యాయస్థానానికి ఉందని పేర్కొంది. 'న్యాయమూర్తులు చట్టం విషయంలో మాత్రమే నిపుణులు, మత విషయాల్లో కాదు. కాబట్టి న్యాయస్థానాలు మత ఆచారాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేవు' అన్న కేంద్ర ప్రభుత్వ వాదనకు ప్రతిస్పందనగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో, 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం శబరిమల కేసును విచారణ చేస్తోంది. ఈ ధర్మాసనంలో జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ , జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్ , జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్ , జస్టిస్ ప్రసన్న బి.వరాలే, జస్టిస్ ఆర్ మహదేవన్ , జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ ఉన్నారు. ఈ బెంచ్ ఆధ్వర్యంలో కేరళలోని శబరిమల ఆలయంతో సహా, వివిధ మత ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై, అలాగే వివిధ మతాల్లో ఉన్న స్త్రీ మత స్వేచ్ఛ పరిధిపై విచారణ జరుగుతోంది.

#### కోర్టులకు ఆ అధికారం ఎక్కడిది?

కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, "ఒక ఆచారం మూఢనమ్మకమని కోర్టు ఎలా నిర్ణయిస్తుంది? ఒక వేళ అది మూఢనమ్మకమని భావించినప్పటికీ, దానిని నిర్ధరించాల్సింది కోర్టు కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25(2)(బి) ప్రకారం చట్టసభలు (లెజిస్లేచర్ ) మాత్రమే సంస్కరణ (రిఫార్మ్ లా) చట్టాలను తీసుకురావాల్సి ఉంటుంది. ఎలా అంటే, ఒక నిర్దిష్ట ఆచారం మూఢనమ్మకం అని, దానికి సంస్కరణ అవసరమని శాసనసభలు చెప్పవచ్చు. చేతబడి లాంటి ఆచారాలను నిరోధించడానికి ఇప్పటికే అనేక చట్టాలు ఉన్నాయి" అని పేర్కొన్నారు.

#### కోర్టుకు ఆ హక్కు ఉంది!

మెహతా వాదనపై జస్టిస్ అమానుల్లా స్పందిస్తూ, "ఏదైనా మతాచారం మూఢనమ్మకమా, కాదా అని నిర్ణయించే హక్కు న్యాయస్థానానికి ఉంది. ఆ తర్వాత ఏం చేయాలనేది శాసనసభ చూసుకుంటుంది. కానీ శాసనసభ నిర్ణయమే అంతిమం అని కోర్టులో చెప్పలేరు" అని పేర్కొన్నారు.

## రోడ్ల నిర్మాణంతోనే జాతి నిర్మాణం, ఆర్థిక ప్రగతి

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన రాజమండ్రి, కాకినాడ, తిరుపతి, కర్నూలు, నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఔటర్ కారిడార్ మోడల్స్‌ను అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. నగరాలకు రింగ్ రోడ్లు నిర్మించడం వల్ల ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం అవుతాయని, ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. పొరుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాలను ఏపీతో అనుసంధానించేలా రహదారుల నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు.

రహదారుల పటిష్ఠ నిర్వహణపై సీఎం దృష్టి

రాష్ట్రంలో రహదారుల నిర్వహణ అత్యంత పటిష్ఠంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 45,433 కిలోమీటర్ల రోడ్లలో, ఏటా 10,238 కిలోమీటర్ల మేర నిరంతర నిర్వహణ చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. రోడ్లపై గుంతలు పడిన వెంటనే మరమ్మతులు చేపడితే సమస్యలు ఉండవని, ఇది నిరంతర ప్రక్రియగా సాగాలని సూచించారు. రోడ్ల నిర్వహణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ రహదారుల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు నల్లరేగడి నేలలున్న ప్రాంతాల్లో హైబ్రీడ్ మోడల్‌లో బీటీ లేదా వైట్ ట్యాప్ రోడ్లు నిర్మించాలని, కాలువ గట్ల వెంబడి తరచూ దెబ్బతింటున్న 570 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి కొత్త సాంకేతికతపై యూనివర్సిటీలతో అధ్యయనం చేయించాలని సూచించారు.

గోదావరి పుష్కరాలకు ప్రత్యేక కార్యాచరణ

రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి,



కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 471 గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. గ్రేటర్ రాజమహేంద్రవరం పరిధిలో చేపట్టే రహదారుల అభివృద్ధి పనులు రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పుష్కరాల కోసం రూ.400 కోట్ల 'సాస్కీ' నిధులతో 531 కిలోమీటర్ల పొడవైన రహదారులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. కుంభమేళా తరహాలో పుష్కరాలకు నిధులు కేటాయించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులకు సూచించారు.

### పోర్టుల అనుసంధానమే లక్ష్యం

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పోర్టులు గుండెకాయ వంటివని, వాటిని కలుపుతూ జాతీయ రహదారుల నిర్మాణం జరగాలని చంద్రబాబు అన్నారు. పశ్చిమ భారతంలో గుజరాత్ మోడల్ తరహాలో, తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్‌ను పోర్టుల హబ్‌గా తీర్చిదిద్దాలని చెప్పారు. ఈస్ట్-వెస్ట్ కారిడార్ల నిర్మాణంతో లాజిస్టిక్స్ వ్యయాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మూలపేట, విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులను అనుసంధానిస్తూ, పొరుగు రాష్ట్రాల సరిహద్దుల వరకు ప్రత్యామ్నాయ మార్గాలను కూడా నిర్మించాలని చెప్పారు. దీనికి అవసరమైన ఆర్థిక వనరులను 'ఏపీ లింక్' ద్వారా సమకూర్చుకోవాలని సూచించారు.

ఆర్థిక ప్రగతికి జాతీయ రహదారుల కీలకం

"జాతీయ రహదారుల నిర్మాణంతోనే జాతి నిర్మాణం జరుగుతుంది" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రహదారుల నిర్మాణం ద్వారా సమీప ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలన్నారు. పారిశ్రామిక, ఉద్యాన ఉత్పత్తులకు కేంద్రంగా మారుతున్న ఏపీ నుంచి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు సరుకు రవాణా సులభతరం కావాలని చెప్పారు. ఖరగ్ పూర్-అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబాద్-శ్రీశైలం-దోర్నాల, కల్వకుర్తి-నంద్యాల వంటి జాతీయ రహదారులతో కనెక్టివిటీ మరింత పెరుగుతుందని తెలిపారు. రాబోయే రెండేళ్లలో 1335 కిలోమీటర్ల జాతీయ రహదారులు అందుబాటులోకి వస్తాయని, ఈ ఏడాదిలోనే రూ.24,502 కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు.

తక్కువ వ్యయంతో ఈవీ బస్సులు

ప్రజా రవాణాను అతి తక్కువ వ్యయంతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, దీనికి ఎలక్ట్రిక్ బస్సుల వినియోగమే సరైన మార్గమని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం కిలోమీటరుకు రూ.72గా ఉన్న ఈవీ బస్సు నిర్వహణ వ్యయాన్ని తగ్గించేందుకు వివిధ మోడళ్లను అధ్యయనం చేయాలని సూచించారు. ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ స్టాండర్డైజేషన్ వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. అన్ని కేటగిరీల్లోనూ ఏసీ ఈవీ బస్సులనే నడపాలని, ప్రజల్లో ఈ-సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహించి దానిని ఒక మాస్ ట్రాన్స్‌పోర్ట్‌గా మార్చాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం, జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన..

మొదటి పేజి తరువాయి

బుధవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి రెండు ప్రాంతాల్లో కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు వేగంతో వీస్తాయని చెప్పింది. ఇక గురు, శుక్రవారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని వివరించింది.

#### దక్షిణ కోస్తా ఏపీలో..

బుధ, గురు వారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందంది. ఉరుములతో కూడిన మెరుపులు సంభవించే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయంది. శుక్రవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందంది.

#### రాయలసీమలో..

బుధవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని తెలిపింది. గురు, శుక్ర వారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని పేర్కొంది.

#### తెలంగాణలో రాగల మూడు రోజుల వాతావరణ పరిస్థితులు..

ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో ఉపరితల చక్రవాత ఆవర్తనం సముద్ర మట్టం నుంచి 0.9 కిలోమీటర్ల ఎత్తులో బుధవారం ఏర్పడిందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని



ప్రభావంతో ఈ రోజు (బుధవారం) తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు ఒకటి రెండు జిల్లాల్లో కురిసే అవకాశం ఉంది. రానున్న మూడు రోజులు రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఈ రోజు రాష్ట్రంలోని ఒకటి.. రెండు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని తెలిపింది.

## ఇరాన్ ఒప్పందం ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి

మొదటి పేజి తరువాయి

జేడీ వాన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది చాలా 'బలహీనమైన ఒప్పందం' అని, టెహ్రాన్‌లోని అంతర్గత విభేదాల కారణంగా ఇది ఏ క్షణంలోనైనా విఫలం కావచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ ఇరాన్ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. బుడాపెస్ట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ వాన్స్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. అధ్యక్షుడు ట్రంప్ తమను నిజాయతీగా చర్చలు జరపమని ఆదేశించారని, అయితే తమ సహనానికి కూడా ఒక హద్దు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. "వారు నిజాయతీగా చర్చలు జరిపితే, మేం కచ్చితంగా ఒక విస్తృత ఒప్పందాన్ని కుదుర్చుకోగలుగుతాం. కానీ, వారు అబద్ధాలు చెప్పినా, మోసం చేసినా.. దాని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి" అని వాన్స్ హెచ్చరించారు. అవసరమైతే తమ వద్ద స్పష్టమైన సైనిక, దౌత్య, అసాధారణ ఆర్థిక పరపతి ఉందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతానికి ఈ సంధి ఒక స్వల్పమైన దౌత్యపరమైన అవకాశాన్ని మాత్రమే కల్పించిందని, చర్చల్లో ఇరాన్ ఎలా వ్యవహరిస్తుందనే దానిపైనే తదుపరి దశ ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కొన్ని గంటల క్రితమే కుదిరిన ఈ ఒప్పందం కేవలం ఘర్షణలకు తాత్కాలిక



విరామం మాత్రమేనని, దీని భవిష్యత్తుపై అనిశ్చితి కొనసాగుతోందని ఆయన అన్నారు. "ఈ ఒప్పందం కుదిరి కేవలం 8 నుంచి 12 గంటలు మాత్రమే అయింది. అందుకే ఇది బలహీనమైన సంధి అని నేను చెబుతున్నాను" అని వాన్స్ వివరించారు. ప్రపంచ వాణిజ్యానికి ఆటంకం కలిగిస్తున్న కీలకమైన నౌకా మార్గాలను తిరిగి తెరవాలని, ఘర్షణ పూరిత చర్యలను నిలిపివేయాలని అమెరికా ఇచ్చిన అల్టిమేటం తర్వాతే ఈ ఒప్పందం కుదిరింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు చర్చలు జరిపినట్లు వాన్స్ తెలిపారు. "కీలక జలమార్గాలను తెరవండి, మేం కాల్పుల విరమణకు సిద్ధమవుతాం అని అధ్యక్షుడు స్పష్టంగా చెప్పారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం, వ్యూహాత్మక జలమార్గాల గుండా నౌకల రాకపోకలను పునరుద్ధరించడానికి ఇరాన్ అంగీకరించింది. దీనికి బదులుగా, అమెరికా, దాని మిత్రదేశాలు సైనిక దాడులను నిలిపివేశాయి. అయితే, కాల్పుల విరమణకు ముందే అమెరికా తన సైనిక లక్ష్యాన్ని సాధించిందని వాన్స్ స్పష్టం చేశారు. "ఇరాన్ సైనిక శక్తిని నిర్వీర్యం చేయడమే మా అధ్యక్షుడి లక్ష్యం. ఆ లక్ష్యం ఇప్పటికే నెరవేరింది" అని అన్నారు. ఒప్పందం కుదిరినప్పటికీ, ఇరాన్ నాయకత్వంలోని భిన్నాభిప్రాయాలు పరిస్థితిని క్లిష్టతరం చేస్తున్నాయని వాన్స్ ఆందోళన వ్యక్తం చేశారు. "ఇరాన్‌లో కొందరు ఈ ఒప్పందాన్ని సానుకూలంగా స్వాగతిస్తుంటే, మరికొందరు మాత్రం మేం సాధించిన దాని గురించి, ఒప్పందం స్వభావం గురించి పూర్తిగా అబద్ధాలు చెబుతున్నారు. కాల్పుల విరమణపైనా తప్పుడు ప్రచారం చేస్తున్నారు" అని ఆరోపించారు. ఈ అంతర్గత వైరుధ్యాలే సంధి బలహీనంగా ఉండటానికి ప్రధాన కారణమని, జాగ్రత్తగా వ్యవహరించకపోతే అది విఫలమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

## పెట్టుబడిదారీ విధానమే.. యుద్ధాల మూలం!

పాలకులు చాలా సందర్భాల్లో ప్రజలకన్నా కార్పొరేట్ల ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే భావన ఉంది. దీనివల్ల సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోంది. సహజ వనరులు, ఉత్పత్తి వ్యవస్థలు పెద్ద కార్పొరేట్ల నియంత్రణలోకి వెళ్తున్నాయి. వివిధ దేశాల మధ్య యుద్ధాలు కూడా వనరులు, ఆర్థిక ఆధిపత్యం కోసం జరుగుతున్నాయని విమర్శ ఉంది. ప్రభుత్వాలు పన్ను రాయితీలు, విధానాల ద్వారా కార్పొరేట్లకు మద్దతు ఇస్తున్నాయని అంటారు. ఫలితంగా ప్రజలకు దక్కాల్సిన ప్రయోజనాలు తగ్గుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. పెట్టుబడిదారుల ద్వారా దేశాలు అభివృద్ధి చెందిపోతాయనే మాట అటు ఉంచితే వారు పెట్టే పెట్టుబడితో సంపద పెరిగి మానవ శ్రేయస్సు పెరిగిపోతుందని నేటి పాలకుల మాట వింటుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఎందుకంటే పెట్టు బడిదారులు లాభార్జన కోసం పోటీ పడుతుంటారు.. దీనికోసం అన్ని ఉత్పత్తులతో పాటు ఆయుధాల ఉత్పత్తి చేస్తుంటారు. అయితే ఈ ఉత్పత్తి ద్వారా ఒక దేశం మరొక దేశాన్ని అదుపు ఆజ్ఞలలో పెట్టుకుని అక్కడి వనరులను దోపిడీ చేసేందుకు చేస్తుంటాయి. ఈ విధానాలను ప్రభుత్వాలు కూడా అమలు చేయడం విచారకరం.

#### యుద్ధాలను వారిస్తాను అంటూనే..

యుద్ధం పెట్టుబడిదారీ విధానం విభజించలేని కవల పిల్లలని మొదటి ప్రపంచ యుద్ధం నాడే లెనిన్ తెలియ జేశారు. పెట్టుబడిదారీ విధానం గుత్త పెట్టుబడిదారీ విధానం వైపు మళ్లేటప్పుడు సంపద కేంద్రీకరణ ఆదాయ అసమానతలు పెరిగి సామ్రాజ్యవాదంతో యుద్ధాలు తప్పని సరి. ప్రస్తుతం వివిధ దేశాలలో ఉన్న సహజ వనరులైన ఖనిజ సంపద, చమురు నిల్వలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం, ఆయుధాలను మార్కెట్ చేసుకోవడం కోసం ప్రపంచంలో యుద్ధాలు జరుగుతున్నాయి. కానీ మానవ శ్రేయస్సుకు ఏ మాత్రం కాదు. పెట్టుబడిదారుల పెద్దన్న అమెరికా అధ్యక్షులు యుద్ధాలు చేయబోను, యుద్ధాలను వారిస్తాను అంటూ మాదక ద్రవ్యాల సాకుతో అబద్ధపు ఆరోపణలతో వెనిజులా అధ్యక్షుడిని అపహరించారు. ఇరాన్ అణ్వస్త్రాలు తయారు చేస్తుందని సాకు చూపుతూ ఆ దేశ అధినేతను కుటుంబ సభ్యులతో సహా హత్య చేశారు.. నిజానికి ఇరాన్‌ను సామంత రాజ్యంగా మార్చి చమురు నిల్వలు కాజేయడం ట్రంప్ లక్ష్యం.

#### నాయకత్వం వహించేవారు ఇలా ఉంటారా?

రెండో ప్రపంచ యుద్ధం ద్వారా అనేక దేశాలను నియంత్రించగలిగే శక్తి అమెరికాకు యూరోప్ దేశాలకు లభించడం



వలన తద్వారా దేశాల అభివృద్ధి పథంలో ఉన్నాయి.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత గత 80 సంవత్సరాల్లో, అనేక దేశాలలో ప్రభుత్వాల మార్పునకు అమెరికా ప్రయత్నించింది. ఈ క్రమంలో సంభవించిన ఏ ఒక్క యుద్ధంలో కూడా అమెరికా గెలవలేదు.. ఊహకందనంత మారణహోమం తర్వాత కూడా అమెరికా తోక ముడుచుకుని పారిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వియత్నాం, అఫ్ఘానిస్తాన్‌లో అమెరికాకు ఎదురైన పరాజయాలే అందుకు ఉదాహరణలు.. తమ ఆధిపత్యాన్ని సవాల్ చేసిన ప్రతి ఒక్కరినీ నిర్దాక్షిణ్యంగా అంతమొందిస్తామని అనేక చర్యల ద్వారా ప్రపంచ దేశాలను అమెరికా హెచ్చరించింది. విచిత్రంగా స్వేచ్ఛా ప్రపంచంగా భావించే మిగతా దేశాలు ఈ అంశంలో మౌనంగా ఉన్నాయి. ప్రపంచ జీడీపీలో అమెరికాది 25 శాతం. చైనా, ఇండియాది కలిపి ప్రపంచ జీడీపీలో 25 శాతం. అందుకే గ్లోబల్ సౌత్‌కు నాయకత్వం వహించాలని మన ప్రధాని కోరుకుంటున్నారు. అయితే ముధురో దంపతుల అపహరణం గాని, వెనిజులాపై దాడిని కానీ, ఇరాన్‌పై దాడిని కానీ, కమీనే హత్యను గాని కనీసం పరోక్షంగా నైనా ఖండించే సాహసం చేయలేదు. చైనా మాత్రం ఇరాన్ అమెరికా యుద్ధంలో మధ్యవర్తిత్వానికి సిద్ధంగా ఉన్నావని చెబుతున్నది కానీ యుద్ధం ఆపే ప్రయత్నాలు చేయడం లేదు.

#### ప్రత్యామ్నాయ మార్గాలు రూపొందించుకోవాలి!

పాలకులు పెట్టుబడిదారుల కనుసన్నల్లో ఉన్నప్పుడు, లేదా ట్రంప్ లాగా పాలకులే పెట్టుబడిదారులైనప్పుడు ప్రపంచ ప్రజలకు యుద్ధాల బెడద తప్పదు.. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎప్పుడు లాభాల కోసం దోపిడీతో వివిధ కాలాలలో వివిధ దేశాలపై యుద్ధాలు చేస్తూనే ఉన్నది. ఇప్పుడు ప్రపంచ పెట్టుబడిదారులు పెద్దన్న అమెరికా పరిస్థితి అదే. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారి వ్యవస్థ పతాక స్థాయి అని అందుకే లెనిన్ అన్నారు. ఇది పడిపోయే పతాకస్థాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఛాయలు ఉన్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనిశ్చితి పరిస్థితులను ఎదుర్కొంటోంది. గతకొన్ని సంవత్సరాలుగా ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న యుద్ధాలు, ఇంధన ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల పెంపు వంటి పరిణామాలు ప్రపంచ ఆర్థిక స్థిరత్వాన్ని కుదిపేస్తున్నాయి.. ఈ పరిణామాల కారణంగా ప్రపంచ ఆర్థిక మాంద్యం వచ్చే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఈ పరిస్థితుల ప్రభావం మరింత తీవ్రంగా పడే అవకాశముంది. క్యాపి టలిజం ప్రజా శ్రేయస్సును పెంపొందించలేదు. అందుకే పాలకులు ప్రజా శ్రేయస్సు కోసం ప్రత్యామ్నాయ మార్గాలను రూపొందించుకోవాలి. లేకపోతే మానవ మనుగడకే ముప్పు.

## పోచారం గ్రామ నూతన అంబేద్కర్ సంఘం ఎన్నిక



ఎడపల్లి ఏప్రిల్ 8 వార్త నిర్భయం ప్రతినిధి: నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం పోచారం కోచ్ గ్రామంలో సర్పంచ్ మెరడీ జ్యోతి రవికుమార్ ఆధ్వర్యంలో ఈరోజు నూతన అంబేద్కర్ సంఘం ఎన్నిక చేయడం జరిగింది . అంబేద్కర్ అధ్యక్షులుగా తాడెం నవీన్ కోశాధికారిగా మరాఠీ జర్రు సభ్యులుగా కట్ట సాయికుమార్ కోల సాయిలు తాడేం బాబు బెజ్జంకి శ్రీకాంత్ లను ఏకగ్రీవంగా ఎన్నుకొని అంబేద్కర్ జయంతి రోజు చేయవలసిన కార్యక్రమాల గురించి చర్చించారు అనంతరం మాజీ అంబేద్కర్ సతీష్ చెప్పినటువంటి లెక్కలు అవకతవకలు ఉన్నాయని సంఘం పెద్దలు అన్నారు దీనిపై అధ్యక్షుడు ఎటువంటి సమాధానం చెప్పకపోవడం నిర్లక్ష్యానికి కారణమని అనుకుంటున్నారు ఈ కార్యక్రమంలో కట్ట సుధాకర్ సుంకరి సుదర్శన్ కట్ట సాయిలు వీడీసీ చైర్మన్ భజనోళ్ల గంగారం కొమురయ్య ఇస్తారి మరియు సంఘం పెద్దమనుషులు పాల్గొన్నారు

## మిట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్టాపన చేసిన గ్రామస్తులు



బోధన్ ఏప్రిల్ 7 వార్త నిర్భయం: నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని పెండకలం గ్రామంలో సొసైటీ చైర్మన్ష్వ రాజిరెడ్డి ఆధ్వర్యంలో మిట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించడం జరిగింది ఇందులో భాగంగా గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది

## ఎడపల్లి వారంతపు సంతను
## ఐదు లక్షల 88 వేలకు కైవసం చేసుకున్న మహమ్మద్



ఎడపల్లి ఏప్రిల్ 7 వార్త నిర్భయం :ఎడపల్లి మండల కేంద్రంలోని నయాబాది లో ప్రతి మంగళవారం జరిగే వారంతపు సంతకు బుధవారం ఎడపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ కందగట్ల రామ్ చందర్, వేలం పాట నిర్వహించారు. సుమారు పక్షం రోజులకి క్రితం ఇదే తై బజార్ని ఎడపల్లి గ్రామానికి చెందిన ఓ ఇద్దరు వ్యాపారస్తులు వేలం పాటలో దక్కించుకున్నారు. అనివర్యా కారణాలవల్ల ఎడపల్లికి చెందిన వ్యాపారస్తులు తై బజార్ నిర్వహణ మా వల్ల కాదని స్వయంగా వారు గ్రామపంచాయతీ సర్పంచ్ కు, అలాగే గ్రామ పంచాయతీ కార్యదర్శి కు చెప్పినట్లు సమాచారం. దీంతో బుధవారం సర్పంచ్ కందగట్ల రామ్ చందర్ ఉపసర్పంచ్ మచ్చుకూరి గంగాధర్, కార్యదర్శి నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో మరో మారు ఎడపల్లి తై బజార్ వేలం పాట నిర్వహించారు. నిజామాబాద్ పట్టణానికి చెందిన మమ్మద్ మజార్ 5 లక్షల 88 వేల రూపాయల పాట పాడి వారాంతపు సంతను దక్కించుకున్నారు. అనంతరం సర్పంచ్ కందగట్ల రామ్ చందర్ తో పాటు గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామ పెద్దలు ఇందులో పాల్గొన్నారు. తై బజార్ బజార్ను వేలం పాటలో దక్కించుకున్న వ్యక్తికి గ్రామపంచాయతీ ద్వారా పత్రాన్ని అందజేశారు..కార్యక్రమంలో సర్పంచ్ కందగట్ల రామ్ చందర్ , ఉప సర్పంచ్ మచ్కూరి గంగాధర్, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగరాజు గౌడ్, గ్రామ పెద్దలు మల్లెపూల శ్రీనివాస్, గ్రామ యువకులు పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఇతర మండలాల నుంచి వచ్చిన చిరు వ్యాపారస్తులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

## టీజీ ఆర్ జె సి సెట్ 2026 కు దరఖాస్తులు



ఎడపల్లి ఏప్రిల్ 7 వార్త నిర్భయం :ఉమ్మడి నిజాంబాద్ జిల్లాలోని ఇటీవల పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థిని విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరాని గాను టీజీ ఆర్ జె సి సెట్ 2026 కు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ గంగా శంకర్ తెలిపారు. తెలంగాణ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించబడతాయని ఆయన తెలిపారు టీజీ ఆర్ జె సి సెట్ 2026 కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు ఉమ్మడి జిల్లాలో ఉన్న నాలుగు గురుకులాల కాలేజీలు, ఇందులో రెండు బాలికలకు మరో రెండు బాలురకు అని ఆయన తెలిపారు, అలాగే కేజీ వివి, వైశ్రీశ్రీశివ లో బాలికలకు 6 కళాశాలలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందే విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం ఉంటుందన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎం ఇ సి సిఈ సి గ్రూపులలో చేరాచున్నారు. టి జి ఆర్ జె సి సెట్ 256 పరీక్షను మే మూడవ తేదీన జిల్లా కేంద్రంలో ఉంటుందన్నారు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటలకు పరీక్ష కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు అర్హత గల విద్యార్థులు దరఖాస్తులను ఆన్లైన్లో సమర్పించాలన్నారు. టీజీ ఆర్ జె సి,, ఈ జి జి గావ్. ఇన్ వెబ్సైట్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు ఈనెల 16 నుంచి, 15, ఏప్రిల్ 2026 వరకు విద్యార్థులు 200 రూపాయల ఫీజును ఆన్లైన్లో చెల్లించాలన్నారు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## గుడిపల్లి కెనాల్‌లో ఈతకు వెళ్లిన విద్యార్థి మృతి... మరుసటి రోజు మృతదేహం లభ్యం



రేవల్లి ఏప్రిల్ 8 (వార్త నిర్భయం):

గుడిపల్లి కెనాల్‌లో ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి గల్లంతై, అనంతరం మృతదేహంగా లభ్యమైన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది.స్థానికుల వివరాల ప్రకారం, నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దాపురం గ్రామానికి చెందిన పులి రవికుమార్ (16) మంగళవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి గుడిపల్లి రిజర్వాయర్ డి-8 కెనాల్‌లో ఈతకు వెళ్లాడు. ఈ సందర్భంగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో అతడు అదుపు తప్పి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న స్థానికులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం తల్పునూర్ గ్రామ శివారులో అతని మృతదేహం లభ్యమైంది.పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రతి గర్భవతి సురక్షిత మాతృత్వం పొందాలి...

**- సురక్షిత మాతృత్వం కొరకు వైద్యుల సూచనలు సలహాలు తప్పకుండా పాటించాలి....**

**- జిల్లా అదనపు (రెవిన్యూ) కలెక్టర్ పి. అమరేందర్.**




నాగర్ కర్నూల్ బ్యూరో ఏప్రిల్ 8 (వార్త నిర్భయం) జిల్లా లోని ప్రతి గర్భవతి సురక్షిత మాతృత్వం పొందేలా వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. అమరేందర్ అన్నారు. బుధవారం నాడు 99 రోజుల ఆరోగ్య మిషన్ కార్యక్రమం లో నిర్వహిస్తున్న ఆరోగ్య అవగాహన వారోత్సవంలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో గర్భవతులకు బాలింతలకు సురక్షిత మాతృత్వం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని గౌరవ జిల్లా అదనపు కలెక్టర్ పి. అమరేందర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం,సమాజం బాగుంటుందని,మహిళా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలియజేశారు. ముఖ్యంగా ప్రతి మహిళ విద్యావంతురాలు అయితే వైద్యులు ఆరోగ్య సిబ్బంది చెప్పిన విషయాలు పట్ల సంపూర్ణ అవగాహన కలుగుతుందని తద్వారా మహిళ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలుగుతుందని, మహిళలు గర్భం దాల్చడానికి ముందుగా మానసికంగా సంసిద్ధం కావాలని,రక్తహీనత నివారించడానికి స్థానికంగా లభించే పచ్చని ఆకుకూరలు, కాయగూరలు,పండ్లు, తృణధాన్యాలు తదితర పౌష్టికాహారం తీసుకోవాలని,వైద్యుల సూచనలు పాటించాలని, బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం 3 సంవత్సరాల వ్యవధి,కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని తెలియజేశారు.డిఎం.హెచ్.ఓ డాక్టర్ కే.రవికుమార్ నాయక్ మాట్లాడుతూ గర్భం దాల్చిన మహిళా 12 వారాల లోపు గ్రామం లోని ఎ.ఎన్.ఎం.దగ్గర నమోదు చేసుకోవాలని, ఐరన్ ఫోలిక్,క్యాల్షియం,బి.సి. మాత్రలు తప్పకుండా గర్భవతులు వేసుకోవాలన్నారు.ప్రతి గర్భవతి కచ్చితంగా గైనకాలజిస్ట్ డాక్టర్ చెకప్ లు చేయించుకుని వారి సూచనలు పాటించాలని, వారి సలహా మేరకు బర్త్ ప్లాన్ చేసుకోవాలని, సాధారణ ప్రసవం అయ్యేలా వ్యాయామాలు, పౌష్టికాహారం తెలుసుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ టి. ఉషారాణి మాట్లాడుతూ గర్భం దాల్చిన ప్రతి మహిళ కాన్పు తర్వాత తల్లి బిడ్డ క్షేమంగా (సురక్షిత మాతృత్వం) ఉండేలా ముందస్తుగా పరీక్షలు చేయించు కోవాలని,జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సుశిక్షితులైన నర్సింగ్ సిబ్బంది,వైద్య నిపుణులు ఉన్నారని , వారి సూచనలు ప్రతి గర్భవతి పాటించాలని తద్వారా 90% సాధారణ ప్రసవాలు జరుగుతాయని తెలియజేశారు. తదనంతరం స్త్రీ వైద్య నిపుణులు ప్రొఫెసర్లు డాక్టర్ నీలిమ,డాక్టర్ సుప్రియ గర్భవతులకు, బాలింతలకు తగిన సూచనలు సలహాలు తెలియజేశారు. ఆస్పత్రిలో ప్రతిరోజు 10 నుండి 15 ప్రసవాలు జరుగుతాయని నెలలో 430కు పైగా డెలివరీలు జరుగుతున్నట్లు తెలిపారు.తర్వాత జిల్లా అదనపు కలెక్టర్ గారి చేతుల మీదుగా సురక్షిత మాతృత్వ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.ఓ డాక్టర్ రవిశంకర్,డాక్టర్ ప్రశాంత్,ఆర్ఎంఓ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ కవిత డాక్టర్ సాత్విక,జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాలాచారి,నర్సింగ్ సూపరీశీడెంట్లు శైలజ,హెల్త్ ఎడ్యుకేటర్ నరసింహ,ఓరుగంటి శ్రీనివాసులు,నర్సింగ్ అధికారులు ఆనంద్, రూప,సువేదా, ప్రసన్న, హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ యాదగిరి,వివిధ గ్రామాల గర్భవతులు,బాలింతలు పాల్గొన్నారు.

# అఖిలపక్ష ముసుగులో దొంగ దీక్షలు.

**- దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి.**

**- అమాయకమైన ప్రజలతో ధర్నాలు చేస్తూ తెరచాటు రాజకీయాలు.**

**- నాడు మెచ్చిన రిజర్వాయర్**

**- నేడు నచ్చకపోవడం విడ్డూరం.**

**- పని లేక ప్రాజెక్టులపై రాజకీయాలు.**

**- అఖిలపక్ష ముసుగులో దొంగ దీక్షలు.**

గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణ కోసం సర్వేలు చేసి గొల్లపల్లి రిజర్వాయర్ను నిర్మించ తలపెట్టిన గత బిఆర్ఎస్ పార్టీ నేడు రిజర్వాయర్ను నిర్మించోద్దంటూ అమాయకమైన ప్రజలతో ధర్నాలు చేస్తూ తెరచాటు రాజకీయాలు చేస్తుందని గోపాల్పేట ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు నాడు నచ్చినా, మెచ్చిన గొల్లపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకోవడం మీ నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమని వారు విమర్శించారు బుధవారం ఏదుల మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి గోపాల్పేట, రేవల్లి ఏదుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని మాట్లాడారు శ్రీశైలం రిజర్వాయర్ లో ఉన్న నీటిని ఎత్తిపోసుకోవడానికి మనకు ఆన్లైన్ రిజర్వాయర్లు అవసరమని గొల్లపల్లి-చీర్కపల్లి గ్రామాల మధ్యన గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మిస్తే సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని గత బిఆర్ఎస్ ప్రభుత్వం 21/10/2016 రోజున సర్వే నిర్వహించిన గత పాలకులు వారికి స్వలాభం చేకూరకపోవడంతో నేడు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు దొంగే దొంగ దొంగ అన్నట్లుందనీ.ఓడిపోయిన మనిషి మారలేదనీ.ఈ దిగజారుడు రాజకీయాలు మానుకోకపోతే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందన్నారు. మాజీ మంత్రి హయాంలో అన్ని పదవులు ఆయనే చేసేవాడనీ అదే క్రమంలో దాదాపుకోట్ల రూపాయల ఖర్చుతో అప్పట్లో ఈ గొల్లపల్లి రిజర్వాయర్ కు సంబంధించిన సర్వే పూర్తి చేయించాడని వారు తెలిపారు ఆరోజేమో ఎవరు చేయలేదు నేనే చేశాను అని వారికి వారే పొగుడుకున్న మాజీమంత్రి నేడు నేను కాదని నీటి మాలిన మాటలు మాట్లాడుతూ దిగజారుడు రాజకీయం చేస్తున్నాడన్నారు ఏదుల రిజర్వాయర్లో భూములు కోల్పోయిన వారికి నాలుగు ఐదు లక్షలు ఇప్పించి అన్ని దొంగ హామీలు ఇచ్చి వారిని మోసం చేశాడన్నారు.ఆరోజున మాజీ మంత్రి చేస్తున్న పనులకు వెనకాల చప్పట్లు కొట్టిన కొంతమంది నేడు మళ్లీ అదే మాజీ మంత్రి అండతో దొంగ దీక్షలు చేయడం విడ్డూరమన్నారు.కల్వకుర్తి ఎత్తిపోతలలో మొత్తం 60 ప్రాజెక్టులు ఉండగా మాజీ ముఖ్యమంత్రి వాటిని 40కి కుదించి సర్వే నిర్వహించారు అందులో 20 ఆన్లైన్ రిజర్వాయర్ల నిర్మించేందుకు అప్పుడు సర్వేలు పూర్తయ్యాయిలిబి20 రిజర్వాయర్లలో 6 రిజర్వాయర్లు వనపర్తి నియోజకవర్గం పరిధిలో ఉన్న ఆయకట్టుకు నీరు అందించేందుకు ఉపయోగపడతాయి.అందులో గొల్లపల్లి రిజర్వాయర్ మొదటిదనీ అప్పట్లో పబ్లిక్ మీటింగ్లలో ఎన్నో మార్లు వారే చెప్పారని వివరించారు ఇక్కడ గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం జరుగుతుందని గ్రామాలలో ఉన్న టిఆర్ఎస్ నాయకులు 259 సర్వే నెంబర్లు దాదాపు 83 ఎకరాలు దొంగ పట్టాలు చేసుకుని ప్రాజెక్టు నిర్మిస్తే డబ్బులు వచ్చే విధంగా ముందస్తు ప్లాన్ తో మీ బినామీలకు పట్టా చేసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు ఇప్పుడు ప్రభుత్వం మారడంతో వారి భూములన్ని ప్రభుత్వం తిరిగి జప్తు చేసింది దానితో అదే మంటతో నేడు దొంగ దీక్షలు నిర్వహిస్తున్నాని వారు తెలిపారు ఈ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి స్వయంగా తనే వచ్చి ప్రజల అనుమతి లేకుండా ఎటువంటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టము అని తెలియజేసి తన నిబద్ధత చాటుకున్నారని వారు పేర్కొన్నారు ఒకవేళ రైతులు కోరుకుంటే భూములు కోల్పోయిన వారికి వారికి నచ్చే విధంగా పరిహారం చెల్లించి ఆ రైతులకే సన్మానం చేసి ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని స్వయంగా తెలిపారని నాయకులు అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏదుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సుకేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అన్నదమ్ముడిలా సేవ చేస్తున్న ఎమ్మెల్యే ని పట్టుకొని నానా మాటలు అంటున్నారని పార్టీ కార్యకర్తలను కించపరుస్తున్నారని ఆయన హుందాగా మౌనంగా ఉంటున్నామని మేము చేతగారి వారిని కాదని ఎమ్మెల్యే ఆదేశాల మేరకే మౌనంగా ఉంటున్నామని తెలిపారు చనిపోయిన వారికి మేఘన అభయాసం ద్వారా 5000 రూపాయలు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న వారికి అన్నలా అక్కాచెల్లెళ్లకు కొత్త బట్టలు తీసుకెళ్తుంటే వారు మంచి మనసుతో దీవిస్తున్నారని అన్నారు ఆ పార్టీలో ఉన్న దొంగలు వట్టి వెధవలని దొంగ దీక్షలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ మంత్రి ఆనాడు సర్వే చేస్తుంటే సన్నాసుల్లా చూస్తూ నిలుచొని చప్పట్లు కొట్టారని అన్నారు ఏదుల గ్రామ సర్పంచ్ పరుశురాములు మాట్లాడుతూ ఏదుల ప్రాజెక్టు నిర్మించినప్పుడు మా గ్రామ ప్రజల నుండి వ్యతిరేకత రాకుండా



వ్యవసాయం చేసుకొని ప్రజలు బాగుపడతారని ఉద్దేశంతో వారిని ఒప్పించి మీరు ఇచ్చిన హామీలను నమ్మి మోసపోయామన్నారుమల్లన్నసాగర్ లో భూములు కోల్పోయిన వారికి 12 లక్షల రూపాయలు ఇచ్చి మా ప్రాంతంలో భూములు కోల్పోయిన రైతులకు నాలుగైదు లక్షలు ఇచ్చి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు మళ్లీ రేపు బహిరంగ సభకు ఏ ముఖం పెట్టుకొని వస్తారని మొదటగా భూములు కోల్పోయిన బండరాయపాకుల గ్రామానికి వెళ్లి రావాలని ఆ గ్రామానికి వెళ్లి వచ్చే దమ్ము మీకుందా అని ప్రశ్నించారు ఎన్నో హామీలు చెప్పి మోసం చేశారని, భూమిని కోల్పోయిన రైతులు మిగిలిన పొలాలకు సాగునీరు రాకుండా చేశారని చెప్పారు వీటితోపాటు చెరువులలో గల ఒండ్రు మట్టిని కూడా అక్రమంగా గ్రామానికి ఎటువంటి నిధులు ఇవ్వకుండా తీసుకెళ్లారని ఇలాంటి దొంగ పనులు చేసిన వారు ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు బుద్ధారం రిజర్వాయర్ ఏదుల రిజర్వాయర్ కన్నా ఎత్తులో ఉన్నప్పుడు ఏదుల దగ్గర ఏర్పాటు చేసిన తూముద్వారా నీళ్లు ఎలా పైకి వెళ్తాయని ప్రశ్నించారు చీరకపల్లి గ్రామ సర్పంచ్ రవి మాట్లాడుతూ గొల్లపల్లి గ్రామ శివారులో చేస్తున్న దీక్ష అఖిలపక్ష దీక్షనా అని ప్రశ్నించారు అఖిలపక్ష వేదిక అని దొంగ దీక్ష చేస్తూ ప్రజలను మోసం చేస్తూ ఆ ముసుగులో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు దీక్ష చేస్తున్నారని తెలిపారుబండరాయపాకుల గ్రామం ఏదుల ప్రాజెక్టులో భూములు కోల్పోయినప్పుడు గత ప్రభుత్వం సరైన వసతులు కల్పించక చనిపోయిన వ్యక్తి దహన కార్యక్రమాలు కూడా ఇల్లు లేక స్కూల్ దగ్గర నిర్వహించామని ఆ సమయంలో వారి ఆవేదన చెప్పలేమని వారికి ఇప్పటివరకు న్యాయం జరగలేదని అన్నారు చీర్కపల్లి బి.ఆర్.ఎస్ పార్టీ లీడర్ దొడ్ల రాములు ప్లాటుకు పదివేల రూపాయలు వసూలు చేసి గ్రామంలో ప్లాట్లు ఇచ్చారని సర్వేనెంబర్ 76లో రెండు ఎకరాలు ఆయన బినామీలకు ఇంకా కొంతమందికి దొంగ పట్టాలు చేశాడని అన్నారు ఈ కార్యక్రమంలో సత్య శీలా రెడ్డి సుఖేందర్ రెడ్డి సత్య రెడ్డి జయపాల్ రెడ్డి పరశురాములు రవి జానకి రాములు వెంకటస్వామి జమ్మి మల్లేష్ వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# 102వ రోజుకు గొల్లపల్లి--చిర్కపల్లి రిజర్వాయర్ వ్యతిరేక దీక్ష... ప్రముఖ నేతల రాకతో సభకు పిలుపు.

**- దీక్షకు మద్దతుగా మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావు మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాక**

రేవల్లి, ఏప్రిల్ 08 (వార్త నిర్భయం):

గొల్లపల్లి--చిర్కపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న అఖిలపక్ష దీక్ష 102వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు మద్దతుగా మాజీ నీటిపారుదల శాఖ మంత్రి టి హరీష్ రావు, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ రానున్న నేపథ్యంలో సభను విజయవంతం చేయాలని రేవల్లి మండల బీఆర్ఎస్ కార్యకర్తలు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. 600 మీటర్ల వ్యవధిలో మరో ప్రాజెక్టు అవసరమేంటని ప్రశ్నించారు. ఇప్పటికే 90 శాతం పూర్తైన పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయకుండా కొత్త ప్రాజెక్టులను చేపట్టడం వెనుక ఉద్దేశం ఏమిటని నిలదీశారు.ప్రభుత్వం కమిషన్ల కోసం మాత్రమే ప్రాజెక్టులు చేపడుతోందని ఆరోపించారు. నాగర్‌కర్నూల్--వనపర్తి రహదారి పనుల్లో కాంట్రాక్టర్ల మార్పులు, బిల్లుల చెల్లింపుల ఆలస్యం వంటి అంశాలను ప్రస్తావిస్తూ కాంట్రాక్టర్ల ఇబ్బందులను వివరించారు. గ్రామస్థాయిలో చిన్న బిల్లులు కూడా చెల్లించకపోవడం



దురదృష్టకరమన్నారు.ఇంకా ప్రభుత్వ హామీలు అమలు కాలేదని, స్కూటీలు, దళితులకు ఆర్థిక సహాయం, మహిళలకు ఆర్థిక పథకాలు వంటి అంశాలను విస్మరించారని విమర్శించారు. ప్రజల మద్దతుతో ప్రాజెక్టులు చేపడతామని చెబితే, దీక్షను ఎందుకు అడ్డుకుంటున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, బీఆర్ఎస్ పార్టీల మద్దతుతో రైతుల తరపున అఖిలపక్ష పోరాటం కొనసాగుతోందని తెలిపారు. 100 రోజులు దాటినా స్థానిక ఎమ్మెల్యే దీక్షా శిబిరాన్ని సందర్శించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బోర్ల భీమన్న, డిప్యూటీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాణాలు తీస్తున్న రహదారులపై వడ్ల కుప్పలు..

# ప్రమాదంలో మహిళ మృతి, అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

బోధన్ ఏప్రిల్ 8 వార్త నిర్భయం :నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలో రహదారులపై ఆరబెట్టిన వడ్ల కుప్పలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. పెగడపల్లి గ్రామ సమీపంలో రహదారిపై ఆరబెట్టిన వడ్ల కుప్పను ఢీకొని మూడు రోజుల క్రితం తీవ్రంగా గాయపడిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నేడు మృతి చెందడం కలకలం రేపింది. ఈ ఘటనతో స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.రాత్రి వేళల్లో రహదారులపై వడ్ల కుప్పలు స్పష్టంగా కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పంటను ఆరబెట్టేందుకు సరైన వేదికలు లేకపోవడంతో రహదారులనే వడ్ల ఆరబోత ఆశ్రయంగా వినియోగిస్తున్నారని పేర్కొంటున్నారు. అయితే ఈ పరిస్థితిపై సంబంధిత అధికారులు కేవలం హెచ్చరికలు జారీ చేయడానికే పరిమితమవుతున్నారని, క్షేత్రస్థాయిలో శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించడం లేదని సామాజిక వర్గాల నాయకులు మండిపడుతున్నారు.రైతులకు వడ్లు ఆరబెట్టుకునే ప్రత్యేక స్థలాలు, డ్రైయింగ్ యార్డులు, తాత్కాలిక వేదికలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా, రహదారులపై ధాన్యం ఆరబెట్టడం వల్ల కలిగే ప్రమాదాలపై రైతులకు తగిన అవగాహన కల్పించడంలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో సురక్షిత ధాన్యం ఆరబెట్టే సదుపాయాలు కల్పించడంతో పాటు, వెంటనే వరి కొనుగోలు కేంద్రాలను



ప్రారంభించాలి అని ప్రజలు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేకపోతే ఇలాంటి ప్రమాదాలు మరిన్ని అమాయక ప్రాణాలను బలితీసుకునే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## జనయేత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీని కార్యక్రమం..



వరంగల్ ప్రతినిధి ఎప్రిల్ 08 (వార్త నిర్భయం) జనయేత్రి ఫౌండేషన్ వరంగల్ ట్రై సిటీస్ ఆధ్వర్యంలో డబ్ల్యూ. హెచ్. ఓ. (వరల్డ్ హెల్త్ ఆర్గనైజషన్)డే మరియు జనయేత్రి ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్. మునీర్ అహ్మద్ జన్మదినం పురస్కరించుకొని వరంగల్ జిల్లా లోని 19వ డివిజన్ ప్రతాప్ నగర్ లో ఉన్న 30 మంది అర్బన్ హోమ్-లెస్ షెల్టర్(పట్టణ నిరుపేద నిరాశ్రాయులకు) పండ్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్.రహీమ్ ఖాన్ పాల్గొని మాట్లాడుతూ. ఇక్కడి నిరాశ్రాయులకు గతంలో ఎన్నో నిస్వార్థ- సేవా కార్యక్రమాలు చేశామని... ఇలానే భవిష్యత్ లో కూడా చేస్తామని..మా జనయేత్రి ఫౌండేషన్ ను ప్రతి ఒక్కరూ స్పందించి ముందుకు వస్తే మా సేవా కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా విశ్రుత పరుస్తామని అయన ఈ సందర్బంగా తెలియజేశారు.ఈ కార్యక్రమం లో ఫౌండేషన్ సభ్యులు తాహర్, పవన్ మరియు అర్బన్ హోమ్-లెస్ షెల్టర్ నిర్వాహకులు తథితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేద్దాం

**డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి.**

**రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు**

**(పొలిటికల్ అఫైర్స్ కమిటీ) అత్యంత ప్రతిష్టాత్మకంగా మారబోతుంది**

**డిసిసి అధ్యక్షులు శివసేన రెడ్డి**

వనపర్తి బ్యూరో ఏప్రిల్ 8 (వార్త నిర్భయం) పొలిటికల్ అఫైర్స్ కమిటీ అత్యంత కీలకమైన ,పటిష్టమైన వ్యూహంతో నిర్ణయాధికారంగా అధిష్టానం లో పనిచేస్తుందని, అలాంటి ( పి ఏ సి) పొలిటికల్ అఫైర్స్ కమిటీని జిల్లాలో ఏర్పాటు చేయడంతో జిల్లాస్థాయిలో ప్రతిష్టాత్మకంగా మారబోతుందని డిసిసి అధ్యక్షులు శివసేన రెడ్డి అన్నారు బుధవారం నాడు వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ( పి ఏ సి పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిలుగా రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడా యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి , రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి గారు, స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి , దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ,వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి పాల్గొన్నారు.

**చిన్నారెడ్డి మాట్లాడుతూ**

కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే పి ఏ సి పొలిటికల్ అఫైర్స్ కమిటీ నిత్యంపనిచేస్తుందనిఅన్నారు.గ్రామంలో బిఎల్ఏ గారికి కాంగ్రెస్ పార్టీ సహాయ సహకారాలు మెండుగా ఉన్నప్పుడు కష్టపడి పని చేసి ఆ బూత్ లో ఏ ఒక్కరికి ఏ సమస్య ఉన్న పరిష్కరించి ఓట్ బ్యాంక్ పెంచటానికి వీలుంటుందని ఆ విధంగా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా అధ్యక్షులు యువసేన రెడ్డి గారికి విన్నవించారు.గ్రామస్థాయిలో కానీ మండల స్థాయిలో కానీ జిల్లా స్థాయిలో కానీ పార్టీ కోసం కష్టపడ్డా నికార్సైన కార్యకర్తలకు పదవులు ఇచ్చినప్పుడే పార్టీ పది కాలాలపాటు అధికారం లోనే ఉంటుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను నిరుపేద ప్రజలకు అందినప్పుడే ప్రభుత్వానికి ఆదరణ కలుగుతుందని అన్నారు.



**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి మాట్లాడుతూ...**

పొలిటికల్ అఫైర్స్ కమిటీ జిల్లాలో ఏర్పాటు చేయడం క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేసేందుకు శుభసూచకమన్నారు, పార్టీని అభివృద్ధి పథంల్లోకి నడిపించడానికి దోహదపడుతుందన్నారు. అలాగే ఎప్పటికప్పుడు రాజకీయ పరిస్థితులపై రిపోర్టులు సమర్పించడం పార్టీ ఆచరించాల్సిన వ్యూహాలను కమిటీ ఖరారు చేస్తుందన్నారు. ఏ ఎన్నికలు వచ్చినా టికెట్లు కేటాయింపు రిజర్వేషన్లు వంటి అంశాలపై కీలక నిర్ణయాలపై పార్టీ అంతర్గత వ్యూహరచన, అలాగే సీనియర్ నాయకుల అనుభవాన్ని ఉపయోగించుకుని వారిని భాగస్వామ్యం చేస్తుందన్నారు, అధిష్టానం ఆదేశాల మేరకు పొలిటికల్ అఫైర్స్ జిల్లా కమిటీ వేదికగా పనిచేస్తుందన్నారు.అలాగే పి ఏ సి లో 17 మంది సభ్యులు ఉంటారని సూచించారు. బుధవారం నిర్వహించిన పి ఎస్ సి కమిటీ లో ప్రతిపాదించిన ఎజెండా సంస్థ విస్తరణలో భాగంగా బిఎల్ఏ 1, బిఎల్ఏ 2 త్వరగతిన నియమించుకొని ముందుకెళ్లాలన్నారు. దీంతో పాటుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి కేటాయించిన 1 ఎకర స్థలంలో నిర్మాణానికి సంబంధించిన నమూనా తయారైన వెంటనే జిల్లా పార్టీ కార్యాలయానికి ఈ నెల 30లోగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ చేతుల మీదగా శంకుస్థాపన కు శ్రీకారం చుట్టాలని కమిటీ తీర్మానించిందని తెలిపారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల కోసం బ్రేక్ ఫాస్ట్ మిడ్ డే మిల్స్ ఏర్పాటు చేసినందుకు పిసిసి కమిటీ సభ్యులందరూ హర్షించడం జరిగింది.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

## చేసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



వరంగల్. ప్రతినిధి ఎప్రిల్ 08 (వార్త నిర్భయం) పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరంగా మారిందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలు వైద్య చికిత్సల కోసం దరఖాస్తు చేసిన వెంటనే ప్రభుత్వం స్పందించి సహాయం అందిస్తున్నదని ఎంపీ తెలిపారు. హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో ఉన్న ఎంపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎంపీ స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి అర్హుడికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మొత్తం 10 మంది ఆపన్నులకు రూ.3 లక్షల 50 వేల విలువైన సహాయనిధి చెక్కులను అందజేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, అత్యవసర వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయుక్తంగా ఉందని ఎంపీ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నిరంజన్ రెడ్డి దిగజారుడు రాజకీయాలు మానుకో..!

**- రిజర్వాయర్ పై అనవసరమైన రాద్ధాంతం**

**- కమిషన్లకు అలవాటు అయిన కొందరు రిజర్వాయర్ల పేరా రాద్ధాంతం చేస్తున్నారు.**

**- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి.**

వనపర్తి బ్యూరో ఏప్రిల్ 8 (వార్త నిర్భయం) గొల్లపల్లి రిజర్వాయర్ కావాలని జీవో నెంబర్ 105 తీసుకువచ్చింది ఎవరనీ జూన్ 10 2015 టిఆర్ఎస్ పార్టీ వచ్చిన తర్వాత జీవోను తీసుకువచ్చిన నాయకులు నిండు రిజర్వాయర్లు పేరు రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు బుధవారం వనపర్తి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారుపాలమూరు రంగారెడ్డి లో ఒక భాగమైంది ఏదుల రిజర్వాయర్ 2800 ఎకరాలలో రిజర్వాయర్ నిర్మాణం అయిందనీ ఆయన పేర్కొన్నారుఏదుల రిజర్వాయర్ వనపర్తి నియోజకవర్గంలో నిర్మాణం అయిందే తప్ప దాని నుంచి వనపర్తి నియోజకవర్గానికి సంబంధించిన ఒక్క ఎకరాకు కూడా నీళ్లు అందే పరిస్థితి లేదన్నారు ముందు దీనికి సమాధానం చెప్పి తప్పు చేసినమని వనపర్తి అంబేద్కర్ చౌరస్తాలో ముక్కు నేలకు రాయాలని ఎమ్మెల్యే విమర్శించారుఒక్క ఎకరానికి నీళ్లు తీసుకోవచ్చు అని అబద్ధపు మాటలు చెప్పడం ఎంతవరకు సమంజసం కాదన్నారునీళ్లు తీసుకునేందుకే రెగ్యులేటర్ ఏర్పాటు చేశామని చెప్పే నాయకులు రెగ్యులేటర్ దాని కింద ఉన్న బుద్ధారం రిజర్వాయర్ లో ఎత్తు ఎంత అని ఆయన ప్రశ్నించారురెగ్యులేటర్ ఏర్పాటు చేసిన వ్యక్తులు రిజర్వాయర్ ద్వారా ఇంత ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని అలైన్మెంట్ ఎందుకు చేయలేదని ఆయన ప్రశ్నించారు గొల్లపల్లి రిజర్వాయర్ అవసరం లేనప్పుడు 2015వ సంవత్సరంలో ఏదుల రిజర్వాయర్ నిర్మాణం తర్వాత 2016లో +ా తీసుకువచ్చింది మీరు కాదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారులిబి అందుకు సంబంధించి ఆర్ వి అసోసియేషన్ వారి ద్వారా డ్రోన్ సర్వేలు నిర్వహించింది నిజం కాదా అని ఆయన అని ఆయన నిలదీశారులిబిసర్వేకు డబ్బులు సరిపోడం లేదని అంటే మరో నాలుగు కోట్లు సర్వే కేటాయించిన మీరు కాదా అని ఆయన అన్నారులిబిఖశ్రీఅ కి సంబంధించి 4 లక్షల 20వేల ఆయకట్టు ఉంటుందని, ఇందులో జొన్నలబొగడ, ఎల్లూరు, గుడిపల్లి ఉంటాయని ఈ మూడు రిజర్వాయర్ల కలిపి మూడు టీఎంసీల నీరు కూడా లేదని ఇందుకు సంబంధించి లైవ్ రిజర్వాయర్లు కావాలని 90 రోజుల్లో నీటిని ఎత్తిపోసుకుని స్టాక్ చేసుకునేందుకు మరో 40 రిజర్వాయర్లు 16 ుటీఁ కావాలని అప్పుడున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన విషయం మర్చిపోసి మాట్లాడుతున్నారని ఆయన గుర్తుకు చేశారులిబిఈ రిజర్వార్లకు సంబంధించి రూ. 4250 కోట్లు అవుతాయని సర్వే సంస్థ వెల్లడించడంతో అప్పటి ప్రభుత్వ ఆర్థిక తక్కువ బడ్జెట్ తో



ఎక్కువ నీటి సామర్థ్యం గల రిజర్వాయర్లు మాత్రమేలిబి గుర్తించండి అని చెప్పడంతోలి7 .3 .2019 రోజున అంతొద్దు 20 రిజర్వాయర్లను మాత్రమే కన్సిడర్ చేయండి 2,460 కోట్లు అవుతాయి వాటిని అప్రూవల్ చేయండి అని అప్పటి ముఖ్యమంత్రి చెప్పడంతో అధికారులు అధికారికంగా అప్లోడ్ చేసి ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ 20 రిజర్వాయర్లలో వనపర్తికి సంబంధించి గొల్లపల్లి రిజర్వాయర్ గోపాల్పేట, ఖిల్లా ఘణపురం రిజర్వాయర్, బుద్ధారం రిజర్వాయర్, బుద్ధారం స్టేజ్ 2 రిజర్వాయర్ , గట్లఖానాపురం రిజర్వాయర్, ఈ 6 రిజర్వాయర్లలో ఆరు నుంచి ఎనిమిది టిఎంసిల నీటి నిల్వ ఉంటుందని పేర్కొన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు ఇందుకు సంబంధించి ప్రతీది చేసింది ఆనాట పార్టీ నాయకులేనని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసింది ఏమీ లేదని అప్పుడున్న ప్రాజెక్టులనే ప్రస్తుతం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారుగత ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులపైనే తాను అసెంబ్లీలో మాట్లాడానని అట్ల మాట్లాడిన దానికి ఇక్కడున్న కొంతమంది గత పాలకులు వారి చెంచాలతో రిజర్వాయర్లు వద్దంటూ దొంగ దీక్షలు చేయించడం విడ్డూరమని ఎమ్మెల్యే చెప్పారు.ప్రభుత్వానికి ఎలాంటి వినతులు ఇవ్వకుండానే అనవసరమైన ధర్నాలు చేయడం సమంజసం కాదన్నారు ఇన్ని జీవోలు ఇచ్చింది అప్పుడున్న ఇరిగేషన్ శాఖ మాత్యు హరీష్ రావు గారిని ఆయన గుర్తించారు వారి హయాంలో చేపట్టిన రిజర్వాయర్ల నిర్మాణంలో భూములు కోల్పోయిన కొంతమంది నష్ట పరిహారాలు ఇవ్వకుండా నాన్న ఇబ్బందులకు గురి చేసిన మీరు నేను నీతులు మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు తొమ్మిదినర సంవత్సరాలలో అభివృద్ధి పేరు మీద వనపర్తి నియోజకవర్గంను ధ్వంసం చేశారని ధ్వజమెత్తారులిబివనపర్తి నియోజకవర్గం పునర్వ్యవస్థీకరణలో అప్పటి రాజుగారు నిర్మించిన రిజర్వాయర్లన్నీ డౌన్ స్ట్రీమ్ లోకి వెళ్లిపోయాయని కేవలం బుద్ధారం, బుద్ధారం స్టేజ్ టు, పోల్కే పహాడ్, గొల్లపల్లి రిజర్వాయర్ల నుంచి మాత్రమే వనపర్తి నియోజకవర్గానికి సాగునీరు అందుతుందని ఆయన పేర్కొన్నారు ఈ మేరకు ఈ రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాలని నేటి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కి విన్నవించి ఉన్నామని త్వరలోనే నిర్మాణాలు చేపట్టబోతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ విలేకరుల సమావేశంలో ఎంపీ మల్లు రవి , ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేన రెడ్డి గారు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

## రైతుల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యత.



వనపర్తి బ్యూరో ఏప్రిల్ 8 (వార్త నిర్భయం)

వనపర్తి శాసనసభ్యులు తుడి మేఘారెడ్డి అన్నారు.బుధవారం పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ప్రారంభించారు.లిబిఎమ్మెల్యే మాట్లాడుతూరైతుల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. పెబ్బేరు చుట్టూ పక్కల పరిధిలో మొక్కజొన్న రైతుల సౌకర్యార్థం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను సంప్రదించి పెబ్బేరులో మొదటిసారి మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం మొక్కజొన్న రైతులకు రూ. 2400 మంచి మద్దతు ధర కల్పిస్తోందని, రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రమోదినిరెడ్డి,ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీకి చెంప పెట్టు

**గొల్లపల్లి సభకు న్యాయస్థానం అనుమతి.**

**హరీష్ రావు పర్యటనతో ప్రభుత్వ గుండెల్లో గుబులు.**

**ప్రజాధనాన్ని కాపాడడానికి గొల్లపల్లి సభ.**

**సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి మాజీ మంత్రి**

గొల్లపల్లి రిజర్వాయర్ సభకు న్యాయస్థానం అనుమతి ఇవ్వడం నాయకులకు,అధికారులకు చెంప పెట్టు అని పత్రికా సమావేశంలో పేర్కొన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలోసభలు సమావేశాలు ప్రజల ప్రాథమిక హక్కు.14ఏండ్లు శాంతియుతంగా ఉద్యమం నడిపించాము. సభలునిర్వహించుకోవడానికి ప్రభుత్వం ఎందుకు బయపడుతుంది .ప్రజల అభీష్టం మేరకు ప్రభుత్వం పనిచేయాలి.ప్రజాధనం వృథా కాకూడదు అని మా అభిప్రాయం.ప్రజాస్వామ్యంలో నియంతృత్వం పనిచేయదు.వాగ్దానాలు నెరవేర్చడం చేతకాదు కానీ నిరసనను తొక్కివేయడం న్యాయం కాదు.రైతు దీక్షలకు గౌరవ హరీష్ రావ్ గారి సంఘీభావం.రైతులకు బాసటగా నిలవడానికి ఉద్యమం రాష్ట్ర స్థాయికి తీసుకుపోతాం.సభకు అనుమతించి అకారణంగా అనుమతి రద్దు పోలీస్ అధికారులు చేశారు.ఉద్యమాలు బి.ఆర్.ఎస్ పార్టీకి కొత్తకాదు.ఏనాడు శాంతి భద్రతలకు భంగం కలిగించలేదు.సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం ప్రతిపక్ష బాధ్యత.పిల్లి శానార్థాలు పెడితే ఉట్టి తెగిపడదు.ప్రభుత్వానికి ప్రజా సమస్యలు తెలుసుకోవడంలో ఓపిక కావాలి.ప్రతిపక్ష,ప్రజా సంఘాల ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.ప్రభుత్వ వివక్షతను ప్రశ్నించే మేధావులు ఎక్కడ ఉన్నారు.పోలీస్ అధికారులు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరించడం పద్ధతి కాదు.ప్రభుత్వ పెద్దలు అరాచకానికి పాల్పడుతున్నారు.కె.సి.ఆర్ గారి క్యాంపు కార్యాలయంపై దాడి అమానుషం.ప్రశ్నించే గొంతుకలను ఆపడం నియంత తనానికి నిదర్శనం100రోజులు దీక్షలు చేసిన రైతులకు అభినందనలు మీకు మేము అండగా ఉంటాం.ప్రాజెక్టు కట్టాలి అంటే 80శాతం ప్రజలు రాజ్యాంగం ప్రకారం ఏకాభిప్రాయానికి రావాలి.రైతు భరోసా రైతు బీమా,మద్దతు ధర సంక్షేమ పథకాల అమలుతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగు పడింది.భూసేకరణ అనేది ప్రభుత్వానికి సవాల్.తక్కువ ఖర్చుతో బహుళ ప్రయోజనాల కోసం కె.సి.ఆర్ ప్రాజెక్టుల రూపకల్పన జరిగింది.కె.ఎల్.ఐ పథకం 1984లో పుట్టపాగ మహేంద్ర నాథ్ 30లక్షల ఆయాకట్టుకు ప్రయోజనం కలిగే విధంగా రూపొందించండి



అని అనేడే వినతి చేశారు.16జూన్ 1983 లో ఎన్.టి.ఆర్ సమగ్ర సర్వే కోసం ఆదేశించారు.కె.ఎల్. ఐ నుండి 2లక్షల 50వేల సాగు కోసం 3రిజర్వాయర్లు కట్టాలని 1998జులైలో చంద్రబాబు శంకు స్థాపన చేశారు.ఏలూరు,గుడిపల్లి,జొన్నాల బొగడ కేవలం 4టి.ఎం.సి సామర్థ్యం మాత్రమే.కె.సి.ఆర్ ఉద్యమంతో ప్రాజెక్టుల పూర్తి కోసం పోరాటం. వై.ఎస్.ఆర్ పోతిరెడ్డి పాడు ద్వారా 55క్యూసెక్కుల నీళ్లు తరలించుకుపోయారు.